హరిపురంలో భూ దందా



రాంబిల్లి మండలం హరిపురంలో అధికార, విపక్ష నేతలు కలిసి ఆక్రమణకు యత్నిస్తున్న ఎన్ఆర్ఐ భూమి ఇదే

- రాంబిల్లి మండల టీడీపీ నాయకుడి సహకారం
- రద్దయిన జీపీఏని అడ్డంపెట్టుకుని రిజిస్ట్రేషన్‌కు యత్నాలు
- తన బంధువు ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎన్ఆర్ఐ
- అనంతరం టీడీపీ కండువా కప్పుకున్న వైసీపీ నాయకుడు
- తాజాగా మొత్తం భూమి ఆక్రమణకు యత్నం
- ఎన్ఆర్ఐ బంధువు మరోసారి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- కోర్టు ద్వారా న్యాయం పొందాలని పోలీసులు సలహా

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినప్పటికీ జిల్లాలో ప్రభుత్వ భూములతోపాటు జిరాయితీ భూముల ఆక్రమణలు కొనసాగుతూనే వున్నాయి. కూటమి పార్టీలకు చెందిన కొంతమంది స్థానిక నాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకొని భూదందాలకు తెగబడుతున్నారు. ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలంలో అధికార టీడీపీ, విపక్ష వైసీపీ నాయకులు ఒక్కటై, ఎన్ఆర్ఐకి చెందిన భూమిని చేజిక్కించుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సదరు ఎన్ఆర్ఐ.. స్థానికంగా వున్న తన బంధువు ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'ఇది సివిల్ మేటర్.. కోర్టును ఆశ్రయించండి' అని పోలీసులు ఉచిత సలహా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వివరాల్లోకి వెళితే...

రాంబిల్లి మండలం హరిపురం గ్రామం సర్వే నంబరు 102లో విశాఖపట్నంలోని రామ్‌నగర్‌కు చెందిన ఒక ప్రవాస భారతీయుడికి (ఎన్ఆర్ఐ) ఎకరా మూడు సెంట్ల భూమి వుంది. ఇతని తాతముత్తాతలు రాంబిల్లి మండలానికి చెందిన వారు కావడంతో హరిపురంలో భూమిని గతంలో కొనుగోలు చేశారు. కొంతకాలం తరువాత ఇందులో 40 సెంట్లను విక్రయించారు. మిగిలిన 63 సెంట్ల స్థలం ఎన్ఆర్ఐ పేరునే ఉంది. కాగా 27 సెంట్ల స్థలాన్ని 2021లో జూలైలో పంచదార్ల గజ్జాలు అనే వ్యక్తికి ఎన్ఆర్ఐ జీపీఏ ఇచ్చారు. 2024లో జీపీఏను రద్దు చేసుకుంటూ ఎన్ఆర్ఐ నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 63 సెంట్ల స్థలం ఎన్ఆర్ఐ పేరునే వుంది.

ఎన్ఆర్ఐ స్థలంపై వైసీపీ నేత కన్ను

హరిపురంలో ప్రధాన రహదారికి సమీపంలో సెంటు స్థలం రూ.10 లక్షలకు పైగా ధర పలుకుతున్నది. ఎన్ఆర్ఐకి చెందిన స్థలంపై వైసీపీకి చెందిన ఎలమంచిలి మునిసిపాలిటీలో ఒక మహిళా ప్రజాప్రతినిధి కుమారుడి కన్నుపడింది. హరిపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక నాయకుడితో చేతులు కలిపాడు. ఎన్ఆర్ఐ గతంలో జీపీఏ ఇచ్చిన (తరువాత రద్దు చేసుకున్నారు) గజ్జాలు అనే వ్యక్తితో కుమ్మక్కై 63 సెంట్ల స్థలంలో 27 సెంట్ల స్థలాన్ని ఎలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వైసీపీ నేత తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ప్రయత్నించారు. అంతేకాకుండా మొత్తం స్థలం చుట్టూ సిమెంట్ స్తంభాలు వేయించారు. ఇందుకు స్థానిక టీడీపీ నేత సహకరించారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ గత ఏడాది జూలై 28న తన బంధువు (నవీన్) ద్వారా రాంబిల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సదరు వైసీపీ నాయకుడు పార్టీ ఫిరాయించి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నాడు. ఇప్పుడు ఇద్దరూ కలిసి మొత్తం 63 సెంట్ల స్థలాన్ని పావులు కదుపుతున్నారు. ఎన్ఆర్ఐకి చెందిన స్థలాన్ని ట్రాక్టర్‌తో దున్నించారు. చుట్టూ స్తంభాలు వేయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ బంధువు నవీన్ శనివారం తహసీల్దారు కార్యాలయంలో, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కేసు నమోదు చేసిన పోలీసులు.. అప్పట్లో వైసీపీలో వున్న నాయకుడు తెలుగుదేశం పార్టీలో చేరడం, ఇతనికి స్థానిక టీడీపీ నాయకుడు అండగా వుండడంతో భూ ఆక్రమణపై పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదని తెలిసింది. అంతేకాక కోర్టును ఆశ్రయించి న్యాయం పొందాలని పోలీసులు ఉచిత సలహా ఇచ్చారని ఎన్ఆర్ఐ బంధువు వాపోయారు.

భక్తిశ్రద్ధలతో భోగి


అనకాపల్లి వేగివీధిలో భోగి మంట

జిల్లా అంతటా సంప్రదాయంగా జరుపుకున్న ప్రజలు

- వేకువజామునే ఇళ్ల ముందు, కూడళ్లలో భోగి మంటలు
- ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దిన మహిళలు

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్ వర్క్)

భోగి పండుగను సోమవారం వాడవాడలా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు వేకువజామునే నిద్రలేచి ఇళ్ల ముందు, రహదారులపైన, కూడళ్లలో భోగి మంటలు వేశారు. అనంతరం తలస్నానాలు చేసి దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగులతో ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు, పూలతో అలంకరించారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో వుంటున్న వారు సంక్రాంతి పండగను సొంతూరులో బంధువులు, స్నేహితుల కలిసి ఉత్సాహంగా జరుపుకోవడానికి ఇప్పటికే గ్రామాలకు చేరుకున్నారు. దీంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది.


నర్సీపట్నంలో భోగి వేడుకల్లో పాల్గొన్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు


అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో భోగి మంట వెలిగిస్తున్న ఎంపీ రమేశ్ దంపతులు


నక్కపల్లిలోని తన నివాసంలో నిర్వహించిన భోగి వేడుకల్లో హోం మంత్రి అనిత

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి పండుగలో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా భోగి మంటను వెలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలుగు వారి సంప్రదాయాలకు మరింత వన్నె తెచ్చేలా ఇటువంటి పండుగలను ఘనంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఎంపీ సీఎం రమేశ్ ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంపీ రమేశ్, శ్రీదేవి దంపతులు భోగి మంటను వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


నక్కపల్లి సమీపంలోని తన నివాసంలో హోం మంత్రి వంగలపూడి అనిత సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఆవరణలో ఏర్పాటు చేసిన భోగి మంటను వెలిగించారు. కోలాటం, గంగిరెద్దుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.


గోదాదేవి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం

నక్కపల్లి, జనవరి 13: మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయానికి సమీపంలో వున్న స్వామివారి పుష్పతోటలోని రాతి మండపంలో గోదాదేవి అమ్మవారి కల్యాణోత్సవాన్ని ఆలయ ఆచార, వ్యవహారాల మేరకు ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణంతో కల్యాణ వేదిక మార్మోగింది. కల్యాణోత్సవం అనంతరం తిరువీధి సేవ ఘనంగా జరిగింది. పుణ్యకోటి వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులు, ఇత్తడి శేషతల్పంపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో సేవ నిర్వహించారు.


కల్యాణం అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న గోదాదేవి, రంగనాథస్వామి


ఇత్తడి శేషతల్పంపై మాడవీధుల్లో ఊరేగుతున్న గోదాదేవి

జోరుగా కోడి పందేలు

- శిబిరాలపై పోలీసుల దాడులు
- పలువురిని అదుపులోకి తీసుకుని.. కోడిపుంజులు, నగదు స్వాధీనం

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. కత్తులు కట్టకుండా కొన్నిచోట్ల, కత్తులు కట్టి మరికొన్నిచోట్ల పందేలు నిర్వహిస్తున్నారు. వీటిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. పోలీసుల రాకను దూరం నుంచే గమనించిన పలువురు పందెంరాయుళ్లు పుంజులతో సహా ఉడాయిస్తున్నారు. మరికొన్నిచోట్ల పోలీసులు వెంటపడి కొంతమందిని పట్టుకుంటున్నారు. రావికమతం మండలం గుమ్మాళ్లపాడు శివారులో కోడి పందేల శిబిరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సోమవారం మధ్యాహ్నం దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాన్నారు. రెండు కోడి పుంజులు, రూ.850 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కశింకోట మండలం ఉగ్గినపాలెం శివారులో కోడి పందేలు ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు కోడి పుంజులు, రూ.1,200 నగదు సీజ్ చేశారు. చెప్పారు.

ఎస్.రాయవరం పోలీసులు తిమ్మాపురం ... మిగతా 10వ పేజీలో

బౌద్ధుల ఆరామం బొజ్జన్నకొండ

4-9 శతాబ్దాల కాలంలో విరాజిల్లిన బౌద్ధక్షేత్రం

- ఆకట్టుకునే శిల్పసంపద, గుహలు, ఆరామాలు
- ఇటీవల రూ.7.5 కోట్లతో అభివృద్ధి చేసిన కేంద్రం
- కనుమ పండుగ సందర్భంగా బౌద్ధ మేళా రేపు

తుమ్మపాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): **అనకాపల్లి మండలం శంకరం రెవెన్యూ పరిధిలోని ప్రముఖ బౌద్ధక్షేత్రం బొజ్జన్నకొండ బౌద్ధ మేళాకు సిద్ధమైంది. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి ఏటా కనుమ పండుగ రోజున మేళా నిర్వహించడం అనాదిగా వస్తున్నది. గురువారంనాడు బొజ్జన్నకొండపై ప్రత్యేక ప్రార్థనలు, శాంతి ర్యాలీ, బుద్ధుని ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. దేశ, విదేశాల నుంచి బౌద్ధ భిక్షువులు హాజరవుతారు. కొండ దిగువ మైదానంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ ఎత్తున బొజ్జన్నకొండ తీర్థం జరుగుతుంది. పతంగుల పోటీలు నిర్వహిస్తారు.**


బొజ్జన్నకొండపై బుద్ధుడి రాతి విగ్రహాలు


నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరం


బౌద్ధ భిక్షువులు ధ్యానం చేసిన ప్రదేశం

బొజ్జన్నకొండకు సుదీర్ఘ చరిత్ర

బొజ్జన్నకొండకు సుదీర్ఘ చరిత్ర వుంది. క్రీస్తు శకం నాలుగు నుంచి తొమ్మిది శతాబ్దాల మధ్య కాలంలో ఇక్కడ బౌద్ధ ఆరామాలుగా విరాజిల్లినట్టు చరిత్ర చెబుతున్నది. అయితే 1906-08లో బ్రిటీషర్ అలెగ్జాండర్ రిమ్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగే వరకు ఇక్కడ బౌద్ధ ఆరామాలు వున్నట్టు బాహ్య ప్రపంచానికి తెలియదు. నాటి తవ్వకాల్లో అలనాటి రాజశాసనాలు, నాణేలు ... మిగతా 10వ పేజీలో

తుమ్మపాల షుగర్స్‌లో చోరీలు

- ఇనుప సామాను అపహరిస్తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

తుమ్మపాల/ అనకాపల్లి టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక షుగర్ ఫ్యాక్టరీలో యంత్ర సామగ్రి చోరీకి గురవుతున్నాయి. ఫ్యాక్టరీ అధికారులు ఇక్కడ సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప సామాన్లు ఎత్తుకుపోతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఫ్యాక్టరీలో యంత్ర సామగ్రిని చోరీ చేసి పట్టుకెళుతున్న ఒక యువకుడిని స్థానికులు పట్టుకున్నారు. అనంతరం పట్టణ పోలీసులకు అప్పగించారు. తరువాత ఫ్యాక్టరీ ఏవో ఈశ్వరరావు పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

కేజీహెచ్‌లో మరో రెండు డయాలసిస్ సెంటర్లు

భావననగర్, రాజేంద్రప్రసాద్ వార్డుల్లో ఏర్పాటుకు చర్యలు

- తొలి విడత పది పడకలతో ప్రతిపాదనలు
- రూ.60 లక్షలు ఖర్చవుతుందని అంచనా
- ప్రస్తుతం నెఫ్రాలజీ, నెఫ్రోప్లస్ విభాగాల్లో రోగులకు అందుతున్న సేవలు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కింగ్‌జార్జ్ ఆస్పత్రిలోని రెండు వార్డుల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆస్పత్రిలోని భావననగర్, రాజేంద్రప్రసాద్ వార్డుల్లో వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ వార్డుల్లో వివిధ అనారోగ్య సమస్యలతో ప్రతిరోజూ పదుల సంఖ్యలో రోగులు చేరుతుంటారు. వీరిలో చాలా మందికి డయాలసిస్ అవసరమవుతుంటుంది. ఈ సేవలు అందించేందుకు రోగులను సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లోని నెఫ్రాలజీ విభాగంలో ఉన్న డయాలసిస్ యూనిట్‌కు తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు రోగి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. ఈ ఇబ్బందులను గుర్తించిన అధికారులు అత్యవసరమైన చోట్ల డయాలసిస్ చేసే సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా భావననగర్, రాజేంద్రప్రసాద్ వార్డుల్లో డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. తొలి విడత పది పడకలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం నాలుగు డయాలసిస్ యంత్రాలు, ఇతర పరికరాలు కొనుగోలు చేయాలని ప్రతిపాదించారు. ఇందుకు ఆస్పత్రి అభివృద్ధి నిధులను వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు. కొద్దిరోజుల్లోనే ఈ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.


డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్న రాజేంద్రప్రసాద్ వార్డు

ప్రతి రోజూ 50 మందికి సేవలు..

ప్రస్తుతం కేజీహెచ్‌లో ప్రతిరోజూ 50 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. నెఫ్రాలజీ విభాగంలోని పది డయాలసిస్ యంత్రాలతో ఉన్న సెంటర్‌లో ప్రతిరోజూ 20 మందికి సేవలు అందుతుండగా, సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోనే నెఫ్రోప్లస్ అనే సంస్థ ద్వారా ... మిగతా 10వ పేజీలో

పేదలకు చీరల పంపిణీ



మంగవరంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం గ్రామంలో సోమవారం జనసేన నాయకుడు కట్టా దొర వంద మంది పేద మహిళలకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కట్టా శ్రీను, జనసేన నాయకుడు కట్టా నరసయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం



పురవీధుల్లో వేంకటేశ్వరుని విగ్రహ ఊరేగింపు

మునగపాక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మరాజుపేటలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో సోమవారం తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. మహిళలు, పిల్లల కోలాటం, అన్నమయ్య కీర్తనల స్వరకల్పన అలరించాయి. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. కోలాట గురువుతోపాటు సేవలందిస్తున్న వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీవీ.రాజేశ్వరరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, కాండ్రేగుల వెంకటఅప్పారావు, శివాజీ, ట్రస్టు చైర్మన్ రామేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా విధానంలో మార్పులు జరగాలి

▸▸ అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

మునగపాక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా విధానంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉందని, ధ్యానంతో మానసిక రుగ్మతులు దూరం అవుతాయని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని నాగులాపల్లి మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో సోమవారం ధ్యాన భోగి సంబరాలు జరిగాయి. ఈ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ సంస్కృత శ్లోక ఉచ్చరణతో మేధో సంపద పెరుగుతుందన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత చూపాలన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా దేశ యువత ప్రపంచాన్ని శాసిస్తోందన్నారు. ధ్యాన మందిరం నిర్వాహకురాలు పి.సుజాత అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పెంటకోట వెంకటరావు, రమణాజీ, బుద్ధ సీతావో పులమురశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలి : ప్రగడ



పల్లపువీధి కార్యక్రమంలో పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, జనవరి 13 (ఆంధ్రజోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవరచుకోవాలని ఏపీ రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పల్లపువీధి వినాయక మందిరం వద్ద సోమవారం మేలుకొలుపు ముగింపు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పెంటకోట విజయ్, సూరిశెట్టి కన్నారావు పల్లపువీధి యువకులు, నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని గ్రామాలలో ధనుర్మాసం ఆఖరి రోజు సోమవారం మేలుకొలుపు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండలంలోని సత్యవరం, మాసాహెబ్ పేట, పెదరాంభద్రపురం, కుమారపురం, తదితర గ్రామాలలో సోమవారం తెలవారుజామునే భోగి స్నానాలాచరించి మహిళలు, పెద్దలు, యువకులు నగర సంకీర్తనలో పాల్గొన్నారు. నగర సంకీర్తన ముగింపు రోజున గ్రామాలలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

కోటవురట్లలో..

ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా మండలంలో పాములవాక, కైలాసపట్నంల్లో సోమవారం మేలుకొలుపు ముగింపు కార్యక్రమాన్ని శ్రీరాముని భక్తుల కమిటీ సభ్యులు నిర్వహించారు. శ్రీరామ పట్టాభిషేకం చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా కోలాటం అందర్నీ ఆకట్టుకుంది.



కోటవురట్ల: కైలాసపట్నంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

ఘనంగా భోగి సంబరాలు



అచ్యుతాపురంలో భోగి మంట వేసిన దృశ్యం



నక్కపల్లి: డొంకాడలో భోగి జరుపుకుంటున్న మహిళలు



ఎలమంచిలి: భోగి సంబరాల్లో పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు

పాయకరావుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో భోగి పండుగను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో భోగి మంటలు వేశారు. భోగి సందర్భంగా పాండురంగస్వామి, దుర్గాలమ్మచెట్టు, వేంకటేశ్వరస్వామి, షిర్డీసాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో మెయిన్‌రోడ్డుపై రద్దీ ఏర్పడింది. అన్ని దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

అచ్యుతాపురంలో..

మండలంలో భోగి పండగ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం పల్లెల్లో భోగీ సందడి ప్రారంభమైంది. ఇంటిల్లిపాది తల స్నానాలు చేసి భోగి మంటల వద్దకు వచ్చి బూడిదను బొట్టుగా ధరించారు. సాయంత్రం చిన్నపిల్లలకు భోగి పళ్లు పోసి, ముత్తయిదువులకు తాంబూలాలిచ్చారు. కొత్త అళ్లల్లు, కుటుంబ సభ్యులతో గ్రామాలు సందడిగా కనిపించాయి.

మునగపాకలో..

మండలంలో అన్ని గ్రామాల్లో భోగి మంటలు ఎగసిపడ్డాయి. రైతు కుటుంబీకులు ఈ వేడుకను సంతోషంగా జరుపుకున్నారు. సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రాంబిల్లిలో..

మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం భోగి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో వేకువజామున భోగి మంటలను వేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. లోవపాలెం గ్రామంలోని ఆక్వాయాచరీ నిర్వాహకులు నారాయణరావు ఆర్థిక సాయంతో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. అలాగే వాడనర్సాపురం, అప్పన్నపాలెం, మూలజంప గ్రామాల్లోని భక్తులు దేవతామూర్తుల విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి పూజలు చేశారు

నక్కపల్లిలో..

మండలంలో సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉద్దండపురం, వేంపాడు, నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట, చందనాడ, గుల్లిపాడు, రేబాక, ఉద్దండపురం, న్యాయంపూడి, కాగిత, ఎన్.నర్సాపురం, అమలాపురం, వేంపాడు,డీఎల్‌పురం గ్రామాల్లో తెల్లవారుజామునే యువకులు, పెద్దలు, మహిళలు భోగిమంటలు వేశారు. పలు గ్రామాల్లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు.

ఎలమంచిలిలో..

భోగి పండుగను సోమవారం పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని కొత్తపేట, మిలట్రీ కాలనీ, తులసీనగర్, కాకివానివీధి, ధర్మవరం ప్రాంతాలతోపాటు అన్ని వార్డుల్లోనూ భోగి మంటలను వేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అలాగే మండలంలోని ఏటికొప్పాక, పులపర్తి, పురుషోత్తపురం, తదితర గ్రామాల్లో భోగి సంబరాలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. మండలంలోని జంపపాలెంలో గుర్రపు పోటీలను అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు యల్లపు గోపి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలో భోగిపండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున లేచిస్నానాలు ఆచరించి భోగి మంటలు వేసుకున్నారు. వృద్ధులు, పిల్లలు భోగి మంటల వద్ద చలి కాగారు. అనంతరం ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని గ్రామాలలో సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలోని కూడళ్లలో యువకులు, పెద్దలు భోగి మంటలను వేశారు. ఈ సందర్భంగా పిల్లలు పిడకలను మంటలలో వేశారు. తెలవారుజామునే యువకులు, పెద్దలు, మహిళలు, పిల్లలు భోగి స్నానాలను ఆచరించారు. భోగి, సంక్రాంతి సందర్భంగా పలు గ్రామాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

హోం మంత్రి అనిత నివాసం వద్ద సంక్రాంతి సంబరాలు



కేరళ వాద్యప్రదర్శన వాయిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా వున్న హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంక్రాంతి వేడుకలు అట్టహాసంగా సాగాయి. ఉదయమే సంప్రదాయబద్ధంగా భోగి పండుగను నిర్వహించారు. మంత్రి అనిత కుటుంబసభ్యుల పేరుతో అర్చకులు పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం కోలాట ప్రదర్శన, కేరళ వాద్య కళాకారుల బృందాల ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ఈ కళా బృందాలతోపాటు మంత్రి అనిత కూడా డ్రమ్స్ కొట్టి ఉత్తేజపరిచారు. గంగిరెద్దుల ప్రదర్శన అలరించింది. అనంతరం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ముగ్గులపోటీల్లో విజేతలకు హోం మంత్రి బహుమతులు అందజేశారు.



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

రసవత్తరంగా జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు

ప్రారంభించిన ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జంపపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలను అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది సంక్రాంతి సంబరాలను ప్రజలంతా ఆనందోత్సాహాల నడుమ జరుపుకుంటున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు భయపడేవారన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా సంక్రాంతి పండుగలు నిలుస్తాయన్నారు. మహిళల కోలాటం ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రపు పోటీల్లో సీఎం రమేశ్ కుమారుడు గుర్రంపై స్వారీ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, టీడీపీ నేత దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, స్థానిక నేతలు వెంకట్, దేవకీనాయుడు పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం రాష్ట్ర ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.



రసవత్తరంగా సాగిన గుర్రపు పరుగు పోటీలు



జంపపాలెంలో గుర్రపు పరుగు పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ సీఎం. రమేశ్, ఎమ్మెల్యే సుందరపు

రసవత్తరంగా గుర్రపు పోటీలు

ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన గుర్రపు పరుగు పోటీల్లో 17 జట్లు పాల్గొన్నాయి. రసవత్తరంగా జరిగిన ఈ పోటీలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ పోటీల్లో విజేతగా అనకాపల్లికి చెందిన జర్సీ గుర్రం ప్రథమ, విజయనగరానికి చెందిన సాయివివేక్ గుర్రం ద్వితీయ, అనకాపల్లికి చెందిన లోవాంబిక గుర్రం తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. విజేతలకు నగదుతోపాటు బహుమతులను అందజేశారు. పోటీలను వెంకట్, దేవకీనాయుడు, పి.వెంకట్, తదితరులు నిర్వహించారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

పాయకరావుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక రాధారుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో ప్రధానార్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో అర్చకులు పాండురంగస్వామి, అమ్మవార్ల మూల విరాట్టులను వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో ప్రత్యేక వేదికపై పాండురంగస్వామి, గోదాదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ల వరహాలబాబు దంపతులతోపాటు అర్చకులు నారాయణాచార్యులు, సిబ్బంది తోట సత్తిబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని ఆలయ పండితులు ఘనంగా నిర్వహించారు. భోగి రోజున ఉదయం నుంచి ఆలయ పండితుల వేద మంత్రాల నడుమ నేత్రపర్వంగా సాగిన కల్యాణాన్ని ప్రజలు కనులారా తిలకించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలిలో గోదాదేవి సమేత రంగనాథ స్వామిల కల్యాణం ఘనంగా జరుపుకున్నారు. తులసీనగర్ రామాలయం, పాతవీధిలోని ఆలయాల్లో గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. రామాలయ అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి, పురోహితులు రాచకొండ శ్రీనివాసశర్మల పర్యవేక్షణలో గోదాదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణం సంప్రదాయ రీతిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, రామకృష్ణ దంపతులు కల్యాణంలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు.

కోటవురట్లలో..

మండలంలోని కైలాసపట్నంలో రాజగోపాలస్వామి ఆలయంలో సోమవారం రాజగోపాల స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది.



ఎలమంచిలిలో గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న చైర్‌పర్సన్ రమాకుమారి, రామకృష్ణ దంపతులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి సీపీఎం నిరసన

అచ్యుతాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ సీపీఎం సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు విద్యుత్ బిల్లులు పెంచడంపై బాదుడే బాదుడని కార్యక్రమాన్ని నిర్వహించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ట్రూ అప్ పేరుతో చార్జీలు వసూలు చేయడం శోచనీయమన్నారు. ఆదానీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలొగ్గి స్మార్ట్ మీటర్ల పేరుతో మరో 15 వేల కోట్లు ప్రజలపై భారం మోపనున్నారన్నారు. కార్యక్రమంలో శరగడం రామునాయుడు, సన్యాసిరావు, ధూళి వెంకునాయుడు, చండి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించాలని సోమవారం కొత్తపట్నం, వాడనర్సాపురం గ్రామాల్లో సీపీఎం కార్యకర్తలు భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు ఎన్.నారాయణ రావు, వై.రాములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు సోమవారం ధర్మవరం అగ్రహారంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎప్పుడో వాడిన కరెంటుకు ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల మీద భారం మోపడం తగదన్నారు. కార్యక్రమంలో ఎం. లక్ష్మి, ఎస్.భాస్కర్, ఎస్.రమణ, వెంకటలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.



అచ్యుతాపురం: భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేస్తున్న దృశ్యం



ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారంలో భోగి మంటలో కరెంటు బిల్లులు వేస్తున్న సీపీఎం శ్రేణులు

నేడు లోవపాలెంలో పరశరామన్న తీర్థం



లోవపాలెంలో పరశ రామన్న స్వామివారు

రాంబిల్లి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోవపాలెంలో పరశరామన్న తీర్థం మంగళవారం జరగనుంది. ఇందు కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ తీర్థానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకోనున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు



రాంబిల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదకలవలాపల్లికి చెందిన బంగారు వర్షిత్ (8) తీవ్రంగా గాయపడ్డాడు. జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన వేసిన బట్టల దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేస్తుండగా ఆ సమయంలో రాయిలోడుతో వెళుతున్న లారీ టైరు పేలిపోయింది. దాంతో ఒక రాయి పిక్క వచ్చి వర్షిత్ తలకు బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాలుడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అచ్యుతాపురం ఆస్పత్రికి తరలించగా బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందిన వెంటనే లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. గాయపడిన బాలుడు కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వలేదని, ఇచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు సీతారామరాజు మృతి



అచ్యుతాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ అచ్యుతాపురం శాఖ పూర్వ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకట సీతారామరాజు (68) ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ప్రస్తుతం ఈయన ఏపీటీఎఫ్‌కి గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. ఈయన స్వగ్రామం మల్లవరం. విషయం తెలిసిన వెంటనే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ వచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే ఏపీటీఎఫ్ నాయకులు బీవీ వెంకటపతి రాజు, కేవీ రమణ, ఆడారి దక్షిణామూర్తి, మోటూరు త్రినాథస్వామి, మారిశెట్టి వెంకట అప్పారావు. జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి, పిన్నమరాజు వాసు, పి. రవీంద్ర, కరెడ్ల సూర్యప్రకాష్, బొత్స వెంకటేశ్వరరావు తదితరులు వచ్చి శ్రద్ధాంజలి ఘటించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

మునగపాక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందీశ్వర ప్రాంగణం, తులసీ కళావేదిక వద్ద సోమవారం పేదలకు దుప్పట్లను స్థానిక ఇటుకలు బట్టీ వ్యాపారి ఆడారి అప్పలనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి మునిలినాయుడు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

కోటవురట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శెట్టి సూరమ్మ(84) సోమవారం మృతి చెందింది. అన్నవరం గ్రామానికి చెందిన శెట్టి సూరమ్మ ఈనెల 12వ తేదీన ఇంటి వద్ద వంట చేయడానికిగ్యాస్ స్టవ్ వెలిగించగా మంటలు వ్యాపించి చీరకు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు ఆమెను విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఎస్ఐ రమేష్ తెలిపారు.

చేయి కోల్పోయిన వ్యక్తికి కోటి పరిహారం ఇవ్వాలి

సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాము

అచ్యుతాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లో గల రుషీల్ డెకార్స్ కర్మాగారంలో చేయి కోల్పోయిన వ్యక్తికి కోటి పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రుషీల్ డెకార్స్ కర్మాగారంలో సిప్పర్ ఆపరేటర్‌గా చేస్తున్న రాయగడకు చెందిన ఎన్. పోలిరాజు సోమవారం ఉదయం విధి నిర్వహణలో ఉండగా ప్రమాదం జరిగి కుడి చేయి కోల్పోయడన్నారు. యాజమాన్యం భద్రతా లోపం కారణంగానే అతడు కుడిచేతిని పోగొట్టుకున్నారన్నారు. అందువల్ల కోటి పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.


అనకాపల్లి మండలం కొత్తతలారివానిపాలెంలో భోగిమంట వద్ద యువకులు


అనకాపల్లి మండలం మూలపేటలో...


పరవాడలో బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో...

వాడవాడలా ఆనందాల భోగి

అనకాపల్లి టౌన్/అనకాపల్లి రూరల్/ కొత్తూరు/తుమ్మపాల/ పరవాడ/ సబ్బవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి పండుగను అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో సోమవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. వేకువజామునే అంతా నిద్రలేచి, తలంటు పోసుకుని వీధివీధి వేసిన భోగి మంట దగ్గరకు కుటుంబాలతో సహా విచ్చేశారు. ఈ సందర్భంగా పిల్లల ఆనందానికి అవధులు లేవు. యువత కేరింతలు కొడుతూ, పాటలు పాడుతూ తెగ ఎంజాయ్ చేశారు. అనంతరం ఆలయాలకు వెళ్ల ఇష్ట దైవాలను దర్శించుకున్నారు. అలాగే, రింగు రోడ్డులోని జనసేన కార్యాలయంలో భోగి పండుగను నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రాంకీ భోగి మంటను వెలిగించి సంబరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

పరవాడ : మండల వ్యాప్తంగా భోగి పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే ఇళ్ల వద్ద భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలు అన్న తారతమ్యం లేకుండా వేకువజామునే స్నానమాచరించి భోగి మంట వద్ద పాటలు పాడుతూ హుషారుగా గడిపారు. పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున భోగి మంట వేయగా స్థానికులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామాలయం వద్ద భోగి మంట వేశారు. అలాగే యువజన సంఘాల ఆధ్వర్యంలో వీధుల్లో పోటాపోటీగా పండుగను నిర్వహించారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 79, 85వ వార్డుల పరిధి లోని లంకెలపాలెం పరిసర ప్రాంత కాలనీలు, కన్నూరు, పెదముషిడివాడ, సాలాపువానిపాలెం గ్రామాల్లో భోగి పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున భోగి మంటను వేశారు. అంతా ఓచోట చేరి పాటలు పాడుతూ, చలిమంట కాగుతూ తెగ సందడి చేశారు.

సబ్బవరం : మండలంలోని గ్రామ గ్రామాన భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అంతా నిద్రలేచి, తలంటు పోసుకుని వీధి వీధిన వేసిన భోగి మంట వద్దకు కుటుంబాలతో సహా విచ్చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ఇష్టదైవాలను దర్శించుకున్నారు.


అనకాపల్లి రింగురోడ్డులోని జనసేన కార్యాలయం వద్ద భోగి సందడి


సబ్బవరం మండలం రావలమ్మపాలెంలో..


లంకెలపాలెంలో...

రేపటి నుంచి తీర్థాల సందడి

పరవాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కనుమ నుంచి మండల వ్యాప్తంగా తీర్థాల సందడి ఆరంభం కానుంది. ఇందు కోసం ఆయా వేడుకల నిర్వాహకులు భారీ ఏర్పాట్లను ప్రారంభించారు. ముఖ్యంగా శ్రీరాముల తీర్థాలను ఎక్కువగా జరుపుకుంటారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేయనుండడంతో కోలావహల వాతావరణం నెలకొననుంది. ఈనెల 15వ తేదీ బుధవారం పరవాడ, రావాడ, వాడచీపురుపల్లి, భరణికం. 16న పరవాడ 17న కలపాక, తానాం 18న పి.బోనంగి, 19న గొర్లివానిపాలెం, స్వయంభూవరం, 20న వెన్నెలపాలెం, 21న గొర్లివానిపాలెం, 22న తాడి, 30న లంకెలపాలలెంతో పాటు మరికొన్ని గ్రామాల్లో తీర్థాలు జరపనున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథం పై ఊరేగిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకించారు. 473 కలశాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో జయంత్యుత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

రావలమ్మపాలెంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చొక్కాకుల వెంకటరావు

సబ్బవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావలమ్మపాలెంలో సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ పోటీలను సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి టాస్ ఎగురవేసి, వెంకటరావు బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ పండగ దినాల్లో ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల ఆనందం మరింత వెల్లివిరుస్తుందన్నారు. మొత్తం ఇరవై జట్లు హాజరయ్యాయి. విజేలకు నగదు బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ ఎస్.ముత్యాలనాయుడు, రెడ్డి వాసుదేవరావు, గొంప రమణ, ఎస్. దేముడు, ఎస్.నరసింహమూర్తి, చీపురుపల్లి నాయుడు, జగన్నాథం, దొర, గొర్లి అప్పారావు, కేసరి, సోకు, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కన్నూరుపాలెం పాఠశాలలో రక్తదానం


కన్నూరుపాలెం హైస్కూల్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

కశింకోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కన్నూరుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. లైఫ్ ఆఫ్ గివింగ్ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఇక్కడ సేకరించిన రక్తాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు, గాజువాక అమ్మ బ్లడ్ బ్యాంకులో ఉంచడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి సీపీఎం నిరసన

అనకాపల్లి టౌన్/ కశింకోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం నాయకులు పలుచోట్ల ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేశారు. సీపీఎం, పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, పెదరెల్లి వీధి, విజయరామరాజుపేట, పార్కు సెంటర్ తదితర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రుత్తల శంకరరావు, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపడం తగదన్నారు. ఆ సమస్యపై వెంటనే స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, పెంటకోట శ్రీనివాసరావు, కాళ్ల తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కశింకోటలో సీపీఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డి.డి.వరలక్ష్మి ఇదే అంశంపై ఆందోళన చేపట్టారు. భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దగ్ధం చేశారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ సరిత, అప్పారావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం


గాంధీనగరం వెంకన్న ఆలయం, సత్యనారాయణస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవం

అనకాపల్లి టౌన్, జనవరి13 (ఆంధ్రజ్యోతి) : గాంధీనగరం అంజయ్య కాలనీలో గల వేంకటేశ్వరస్వామి, సుంకరమెట్ట జంక్షన్‌లోని సత్యనారాయణస్వామి ఆలయాల్లో సోమవారం గోదాదేవి రంగనాథుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అంజయ్యకాలనీలోని శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకులు రేజేటి గోప అప్పలాచార్యులు, మారుతిల ఆధ్వర్యంలో ఓబులరెడ్డి దంపతులు కల్యాణాన్ని జరిపించారు. అలాగే సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ దంపతులు గోదాదేవి కల్యాణాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భోగిమంట వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

» ఎమ్మెల్యే కొణతాల, పీలా


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కశింకోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జీవితాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ కోరారు. మండలంలోని తీడ గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ పేరిట ఏటా భోగి పండుగ రోజున తీర్థం నిర్వహించడం ఆనంద దాయకమన్నారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వా లని వారు కోరారు. నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్, టీడీపీ నాయకులు కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, మేడిశెట్టి సన్యాసినాయుడు, వేగి గోపి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, చిరికి సన్యాసినాయుడు, చైతన్య, నిమ్మదల సన్యాసినాయుడు, దుర్గాప్రసాద్, కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో కోడి పందేలు, జూదం నిర్వహిస్తే చర్యలు'

పరవాడ/ సబ్బవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా కోడిపందేలు, జూదం వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు, సబ్బవరం సీఐ పిన్నింటి రమణ హెచ్చరించారు. సోమవారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. బల్లాట, గుళ్లాట, రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో అజ్ఞాత వ్యక్తులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పండుగ నేపథ్యంలో బంధువుల ఇళ్లకు వెళ్లే వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు బంగారం, నగదు వంటివాటిని ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఇద్దరి అరెస్టు

కొత్తూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సుందరయ్యపేట శివారులో కోడిపందేలు ఆడుతున్న ఇద్దర్ని సోమవారం అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేయగా ఇద్దరు వ్యక్తులు కోడిపందేలు నిర్వహిస్తున్నారన్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అనంతరం ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామనానరు.

పేకాట ఆడుతున్న ముగ్గురు అరెస్టు

కొత్తూరు :మార్టూరు గ్రామ శివారున పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేశామని అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.1470 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పరవాడ సంతకు సంక్రాంతి శోభ

పరవాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో సోమవారం నిర్వహించిన వారపు సంతకు సంక్రాంతి శోభ సంతరించుకుంది. దుకాణాలన్నీ వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. మంగళవారం జరుపుకునే సంక్రాంతి పండుగకు అవసరమైన దుస్తులు, కూరగాయలు, పిండి వంటలకు అవసరమైన వివిధ రకాల పప్పులు, నూనెలను కొనుగోలు చేసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేశారు. దీంతో ఎటు చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. నిత్యావసర వస్తువులతో పాటు, వ్యవసాయ పనిముట్లు తదితర అమ్మకాలు భారీగానే జరిగాయి. కనుమ పండుగను పురస్కరించుకొని నాటుకోళ్లను ఎక్కువగా కోనుగోలు చేశారు. దీంతో నాటుకోళ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. సంత కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు పత్తా లేకపోవడంతో స్థానిక యువకులే స్పందించి ట్రాఫిక్‌ను సరిదిద్దడంతో పలువురు అభినందిస్తున్నారు.

సందడిగా భోగి సంబరాలు



లోచలిపుట్టులో భోగి మంటలను వెలిగించిన పాడేరు సర్పంచ్ ఉషారాణి

పాడేరురూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి పండుగను సోమవారం వాడవాడలా సందడిగా నిర్వహించారు. మన్యంలో ఆచార ప్రకారం భోగి పండగను నెలరోజులు నిర్వహిస్తారు. పాడేరు మన్యంలో గిరిజన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను నేటికీ ఆచరిస్తున్న యువత ఆదివారం రాత్రే భోగి మంటలను ప్రారంభించి ఘనంగా సంబరాలు నిర్వహించారు. పాడేరు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి లోచలిపుట్టులో భోగి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనులు ఐక్యంగా సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు ఉత్సాహంగా థింసా నృత్యం చేశారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, గ్రామ పెద్దలు కె.చిట్టినాయుడు, కె.మత్స్యరాజు, కె.రమణ, కె.రాంబాబు, కె.సత్యవతి, కె.సుబ్బలక్ష్మి, కె.చిన్నతల్లి, కె.గంగాభవానీ, జె.రమేష్, సీహెచ్ చైతన్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కుమ్మరిపుట్టులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి గిరిజన సంప్రదాయం ప్రకారం ఆదివారం రాత్రి భోగి మంటలను ప్రారంభించారు. మోదకొండమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శాస్త్రి భోగి మంటలను వేశారు. గుడివాడ, పాతపాడేరు, కొత్తపాడేరు, పాడేరు మెయిన్ రోడ్డులో ఆదివారం రాత్రి భోగి సంబరాలను ప్రారంభించారు. సోమవారం ఉదయం ప్రజలు భక్తిశ్రద్ధలతో భోగి మంటల వద్దకు వెళ్లి మంటల్లో నీటిని వేడి చేసుకొని స్నానాలను ఆచరించారు. అనంతరం భోగి మంటల బూడిదను బొట్టుగా దిద్దుకున్నారు.



కుమ్మరిపుట్టులో భోగి మంటను వెలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



సీలేరులో ఇంటింటికి వెళ్లి సందడి చేస్తున్న గంగిరెద్దు వారు



చింతపల్లి ఎంపీడీవో ఆఫీస్ ఎదుట భోగి మంట వేస్తున్న స్థానికులు

సీలేరులో..

జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో భోగీ పండుగను సందడిగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఇళ్ల ముందు రంగు రంగు ముగ్గులను వేసి భోగి మంటలను వెలిగించారు. మంటల్లో ఆవు పేడతో తయారు చేసిన పిడకలు, ఇళ్లల్లోని పాత సామాన్లను వేశారు. సీలేరు పురవీధుల్లో గంగిరెడ్లు వారు ఇంటింటికి వెళ్లి సందడి చేశారు.

చింతపల్లిలో..

మండల ప్రజలు భోగి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం భోగిని పురస్కరించుకుని పలు వీధుల్లో ఉదయం మూడు, నాలుగు గంటల నుంచే భోగి మంటలను వేశారు. సాయంత్రం వరకు భోగి మంటలు కాలుతూనే వున్నాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట భోగిని సందడిగా నిర్వహించారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

▸▸ సీపీఎం నాయకుల ఆందోళన

పాడేరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, మండల కార్యదర్శి ఎల్.సుందరరావు ఆధ్వర్యంలో సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి, పాడేరులో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ పెంచిన విద్యుత్ సర్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కార్పొరేట్ సంస్థలకు అప్పగించవద్దన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపి తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు దాస్, చిన్నారావు, చలపతి, రాంబాబు, సింహాద్రి, పార్వతమ్మ, కాసులమ్మ పాల్గొన్నారు.



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేస్తున్న సీపీఎం నాయకులు

గ్రామాల్లో గంగిరెద్దుల సందడి

చింతపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని మండలంలో పలు గ్రామాల్లో గంగిరెద్దుల సందడి చేస్తున్నాయి. గతంలో ప్రతి గ్రామానికి పెద్ద సంఖ్యలో గంగిరెద్దులు వచ్చేవి. కొంత కాలంగా గంగిరెద్దుల సందడి గ్రామాల్లో కనిపించలేదు. ఈఏడాది సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సోమవారం చింతపల్లి, లోతుగెడ్డ, లంబసింగి గ్రామాలకు గంగిరెద్దులు వచ్చాయి. పురవీధుల్లో గంగిరెద్దుల నిర్వాహకులు ఇంటింటికి తీసుకొచ్చి పలు విన్యాసాలు, నాట్యం చేయించారు. గంగిరెద్దుల వారికి పిండి వంటలు, కొత్తధాన్యం, నగదును సమర్పించుకుని భక్తిని చాటుకుంటున్నారు.



చింతపల్లి: లోతుగెడ్డ జంక్షన్‌లో సందడి చేస్తున్న గంగిరెద్దు

వారపు సంతకు పండగ కళ

పెదబయలుకు భారీగా తరలివచ్చిన గిరిజనులు

కుండలు, వస్త్రాలు, కోళ్లకు గిరాకీ

ప్రధాన మార్గాలలో ట్రాఫిక్ జామ్

పెదబయలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతకు సంక్రాంతి కళ వచ్చింది. వర్తకులు, వినియోగదారులతో సంత కిక్కిరిసిపోయింది. పెదబయలు మండలంలోని అన్ని గ్రామాలతో పాటు ముంచంగిపుట్టు, జి.మాడుగుల, హుకుంపేట మండలాలు, ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు పండగ సంతకు భారీగా తరలివచ్చారు. ఈ ఏడాది గిరిజన ప్రాంతంలో సైతం తెలుగు క్యాలెండర్ ప్రకారమే పండగ జరుగుతుండడంతో చీమలు కూడా దూరలేని విధంగా వారపు సంతలో జనాలు ఎగబడ్డారు. పండగ సంత కావడంతో అల్లూరి జిల్లా వర్తకులతో పాటు అనకాపల్లి, నర్సీపట్నం జిల్లాలు, ఒడిశా రాష్ట్రం పాడువా, జైపూర్ నుంచి కూడా వర్తకులు అధిక సంఖ్యల్లో వచ్చారు. మారుమూల ప్రాంతాల గిరిజనులు సైతం తాము పండించిన పసుపు, పిప్పళ్లు, అల్లం, రాజ్‌మా వంటి వాణిజ్య పంటలను సంతలో విక్రయించి సంక్రాంతి పండగలకు అవసరమైన వస్తు సామగ్రిని కొనుగోలు చేసుకున్నారు. గిరి గ్రామాల నుంచి పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా కుటుంబ సమేతంగా సంతకు తరలివచ్చారు. దీంతో ఎక్కువగా వస్త్ర దుఖాణాలలో గాలి ఆడలేని విధంగా జనాలు ఎగబడ్డారు.

నాటుకోళ్లు, మట్టి కుండలకు గిరాకీ..

సంక్రాంతి పండగ నేపథ్యంలో గత వారం నుంచే నాటుకోళ్లకు భలే గిరాకీ ఏర్పడింది. ఈ వారం సంతలో నాటు కోళ్లు అంతగా రాకపోవడంతో కొద్దిగాప్పో వచ్చిన కోళ్లను కొనేందుకు వినియోగదారులు ఎగబడ్డారు. దీంతో వాటి ధర తార స్థాయికి చేరింది. కిలో బరువు వచ్చే కోడి ధర రూ.1500 నుంచి రూ.2 వేలు, రెండు కిలోలు వచ్చే పుంజు ధర రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు పలికింది. ధరలు పెరిగినా కొనుగోలుదారులు ఏమాత్రం తగ్గేదే లే అని కొనుగోలు చేశారు. సంక్రాంతి పండగలో పితృదేవతల కోసం పులగం నుంచి సమర్పించటం గిరిజనుల సంప్రదాయం ఆనవాయితీగా వసున్న ఆచారం. అది కూడా మట్టి కుండలో చేయడం వల్ల వారపు సంతలో మట్టి కుండల ధరలు విపరీతంగా పెంచేశారు. కుండ పరిమాణాన్ని బట్టి రూ.130 నుంచి రూ.150 వరకు ధర పలికింది. అయినా మట్టి కుండ ప్రామాణికం కావడంతో గిరిజనులు కొనుగోలు చేశారు.





వారపు సంతలో కొనుగోలుదారులతో కిక్కిరిసిన వస్త్ర దుకాణాలు.. పెదబయలు ప్రధాన రోడ్డులో వాహనాల రద్దీ

వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్

పండగ సంత కావడంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. స్థానిక పెట్రోల్ బంక్ నుంచి ట్రాఫిక్ జామ్ కావడంతో గంటల కొద్ది వాహనదారులు రోడ్డుపైనే నిరీక్షించారు. డిపో ప్రాంతం, జీసీసీ గొడౌన్, పెదబయలు కేంద్రాలలో ట్రాఫిక్ వలయంలో వాహనాలు చిక్కుకున్నాయి. ఎస్ఐ కె.రమణ రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

రాంబిల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదకలవలాపల్లికి చెందిన బంగారు వర్షిత్ (8) తీవ్రంగా గాయపడ్డాడు. జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన వేసిన బట్టల దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేస్తుండగా ఆ సమయంలో రాయిలోడుతో వెళుతున్న లారీ టైరు పేలిపోయింది. దాంతో ఒక రాయి పిక్క వచ్చి వర్షిత్ తలకు బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాలుడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అచ్యుతాపురం ఆస్పత్రికి తరలించగా బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందిన వెంటనే లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. గాయపడిన బాలుడు కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వలేదని, ఇచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

కోటవురట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శెట్టి సూరమ్మ(84) సోమవారం మృతి చెందింది. అన్నవరం గ్రామానికి చెందిన శెట్టి సూరమ్మ ఈనెల 12వ తేదీన ఇంటి వద్ద వంట చేయడానికిగ్యాస్ స్టవ్ వెలిగించగా మంటలు వ్యాపించి చీరకు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు ఆమెను విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఎస్ఐ రమేష్ తెలిపారు.

గ్రామాల్లో ఘనంగా భోగి పండగ

ముంచంగిపుట్టు/హుకుంపేట జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అరకు నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో భోగి పండగ ఘనంగా జరిగింది. ముంచంగిపుట్టు మండలంలోని 23 పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో భోగి మంటలు వేశారు. ఆదివారం సాయంత్రం నుంచే గ్రామాల్లో భోగి సందడి నెలకొంది. గ్రామాల్లో యువకు భోగి మంట వేసేందుకు గాను పెద్ద పెద్ద దుంగలు (కర్రలు) సేకరించారు. సోమవారం తెల్లవారు జామున చిన్నా, పెద్దా అంతా కలసి భోగి మంటలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అంబేడ్కర్ పార్కు సమీపంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున భోగి మంటలను వేశారు. స్థానికులు అధిక సంఖ్యలో వచ్చి పేడ పిడకల దండలను ఆ మంటల్లో వేశారు. ఆ బూడిదను బొట్టు పెట్టుకొనేందుకు ఇళ్లకు తీసుకువెళ్లారు. ఒకరికి ఒకరు భోగి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే హుకుంపేట మండలంలోని భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లోనూ ప్రజలు భోగి శభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేశారు. అలాగే గిరిజన సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి సందడి చేశారు. ఉదయం భోగి స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అలాగే గ్రామాల్లోకి గంగిరెద్దులు రావడంతో, గిరిజన చిన్నారులు వాటిని చూసి ఉత్సాహంగా గడిపారు.





ముంచంగిపుట్టులో భోగి మంట కాగుతున్న యువకులు... హుకుంపేట మండల కేంద్రంలో ఎగసి పడుతున్న భోగి మంట

సారా బట్టీలపై విస్తృత దాడులు

17 వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

55 లీటర్ల సారా స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

అనంతగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాటు సారా బట్టీలపై సోమవారం బోర్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ ఆధ్వర్యంలోని విస్తృతంగా దాడులు నిర్వహించామని ఎక్సైజ్ శాఖ ఎస్ఐ బి.శ్రీధర్ తెలిపారు. గుమ్మకోట, చిప్పపల్లి, రామచంద్రపురం, సింగవరం, కాశీపట్నం, పూతికవలస, సోట్టడివలస, తుమ్మనవలస, ఒరకవద్దు గ్రామాల్లో గెడ్డలను దాటుకుంటూ వెళ్లి, నాటు సారా బట్టీలపై దాడులు చేసినట్టు చెప్పారు. ఇందులో భాగంగా 17 వేల లీటర్ల బెల్లం పులుసు, 80 లీటర్ల సారాను ధ్వంసం చేశామన్నారు. ముగ్గురిని అరెస్టు చేయగా, వారినుంచి 55 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నాటు సారా తయారీ, అమ్మకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



సారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న మొబైల్ పార్టీ పోలీసులు

విద్యా విధానంలో మార్పులు జరగాలి

▸▸ అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

మునగపాక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా విధానంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉందని, ధ్యానంతో మానసిక రుగ్మతులు దూరం అవుతాయని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని నాగులాపల్లి మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో సోమవారం ధ్యాన భోగి సంబరాలు జరిగాయి. ఈ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ సంస్కృత శ్లోక ఉచ్చరణతో మేథో సంపద పెరుగుతుందన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత చూపాలన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా దేశ యువత ప్రపంచాన్ని శాసిస్తోందన్నారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పెంటకోట వెంకటరావు, రమణాజీ, బుద్ధ సీతవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు పరశరామన్న తీర్థం

రాంబిల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోవపాలెంలో పరశరామన్న తీర్థం మంగళవారం జరగనుంది. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ తీర్థానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకోనున్నారు.

పాడేరులో సంక్రాంతి రద్దీ

▸▸ జనాలతో కిటకిటలాడిన రహదారులు



వాహనదారులతో రద్దీగా మారిన పాడేరు రహదారులు

పాడేరురూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. భోగి పండగ సోమవారం కూడా వివిధ మండలాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి దుస్తులు, వివిధ సామగ్రిని కొనుగోలు చేయడంతో పట్టణంలోని వస్త్ర దుకాణాలు, కిరాణా షాపులు రద్దీగా మారాయి. మెయిన్ రోడ్డులోని కొందరు వ్యాపారులు షాపుల్లో నుంచి సామగ్రిని ఫుట్‌పాత్‌మీదకు తీసుకువచ్చి అమ్మకాలు చేపట్టడంతో రహదారులు మరింత రద్దీ అయ్యాయి. వాహనదారులతో రోడ్డు కిటకిటలాడింది. ద్విచక్రవాహనాలు సైతం తప్పించుకొని వెళ్ల లేని పరిస్థితి ఏర్పడడంతో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయ్యింది.

కోడి పందేలు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు

▸▸ జిల్లా పశుసంవర్థక శాఖాధికారి నర్సింహులు



పాడేరురూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు నిర్వహించినా.. పందేల్లో పాల్గొన్నా.. క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి సీహెచ్.నర్సింహులు హెచ్చరించారు. కోడి పందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 10 ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974, సెక్షన్ 34 జంతు హింస నివారణ చట్టం 1960ల ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కోడి పందేలు నిర్వహించవద్దని ఆయన సూచించారు. కోడి పందేలు ఆడి కష్టాలను తెచ్చుకోవద్దని ఆయన అన్నారు.

కోడిలతో పందేలు నిర్వహిస్తే శిక్షార్హులు

పశుసంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో మూగ జీవులు, కోడిలతో పందేలు నిర్వహిస్తే శిక్షార్హులని స్థానిక పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. కోడిపందేలు ఆడినా, నిర్వహించిన వారిపై సెక్షన్ 10 ప్రకారం నేరస్థులుగా పరిగణించి అరెస్టు చేస్తామని అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వెటన్నరీ సహాయకులు అప్పారావు పాల్గొన్నారు

పులి సంచారంపై అటవీ శాఖ అప్రమత్తం



సప్పర్లకొత్తూరులో గిరిజనులతో మాట్లాడుతున్న అటవీ సిబ్బంది

సీలేరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారాలమ్మ ఘాట్ రోడ్డు రేయిన్ గేజ్ సమీపంలో ఆదివారం పెద్దపులి సంచారంపై సీలేరు అటవీ శాఖ రేంజర్ ఎస్. వెంకటరావు, సిబ్బంది సోమవారం మారుమూల గ్రామాల గిరిజనులను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో పశువులను కూడా జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతానికి ఒంటిరిగా వెళ్లరాదని హెచ్చరించారు. పులి సంచరించినట్టు ఏమైనా గుర్తులు ఉన్నా.. లేక ఎవరైనా ప్రత్యక్షంగా చూసిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పులికి ఎటువంటి హాని తలపెట్టవద్దని అటవీశాఖ సిబ్బంది గిరిజనులను కోరారు. సప్పర్లకొత్తూరు, ధర్మాపురం, పెట్టమర్రి, నిమ్మలగొంది గ్రామాల్లో అటవీ శాఖ సిబ్బంది గిరిజనులను సమావేశపర్చి అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధారకొండ ఫారెస్టు సెక్షన్ అధికారి కె.సతీష్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఎస్. సత్యనారాయణ, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.


గోపూజను విజయవంతం చేయాలి

పాడేరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన ప్రాచీన శైవక్షేత్రం స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి ఆలయంలో నిర్వహించనున్న గోపూజను భక్తులు విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు కోరారు. బుధవారం కనుమ పండగ రోజు ఉదయం 9.30 గంటల నుంచి టీటీడీ, వీహెచ్‌పీ సౌజన్యంతో ఆధ్యాత్మిక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామశాస్త్రి, సభ్యుల ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించనున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బోడిపుట్టులో వాలీబాల్ పోటీలు

ముంచంగిపుట్టు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగురాయి పంచాయతీ బోడిపుట్టు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపు, ఓటమితో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విజేత జట్లకు బహుమతులతో పాటు నగదును అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలపై సీపీఎం ఆందోళన



భోగీ మంటల్లో బిల్లులను వేస్తున్న గంగరాజు, సీపీఎం నాయకులు

అనంతగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే తగ్గించాలని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కొత్తవలస, కాశీపట్నం, అనంతగిరి, భీంపోల్, కొత్తూరు, దొరగుడ తదితర గ్రామాల్లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. భోగీ మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను మోసం చేయొద్దని, విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు నాగులు, టోకూరు సర్పంచ్ మోస్య, తదితరులు పాల్గొన్నారు.

15న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు

చీడికాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిజాం పంచాయతీ ఎస్.రామ్‌నగర్ గ్రామంలో ఈ నెల 15న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. పైడితల్లమ్మ తీర్థం సందర్భంగా నిర్వహించ నున్న ఈ పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. అదే రోజు ముగ్గుల పోటీలు కూడా ఏర్పాటు చేస్తామని, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేడు దామునాపల్లి, లక్ష్మీపురంలో ముగ్గులు, ఎడ్ల పరుగు పోటీలు

చోడవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామునాపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పందేలు, ముగ్గుల పోటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సంబరాలకు ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ముఖ్య అతిథిలుగా హాజరవుతారన్నారు. అన్ని పంచాయతీల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో పాల్గొనాలని కోరారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం సంక్రాంతి సంబరాల సందర్భంగా గుర్రం పోటీలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరు కానున్నారని వారు తెలిపారు.

శెట్టిపాలెంలో ముగ్గుల పోటీలు

మాకవరపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతి ఏటా భోగి రోజున ఈ పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది నిర్వహించిన పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దుంగల మహేశ్వరి, దుంగల రొంగల జోగి, దుంగల వనజకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు రాము నాయుడు, టీడీపీ నాయకులు ఈశ్వరరావు, డి.రమణ, బి.కన్నంనాయుడు పాల్గొన్నారు.

120 మంది పాడి రైతులకు కుర్చీల పంపిణీ

నాతవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో 120 మంది పాడి రైతులకు కుర్చీలను పంపిణీ చేసింది. ప్రతి ఏటా సంక్రాంతి పండగను పురస్కరించుకుని పాడి రైతులకు ఉపయోగపడే సామగ్రిని అంది స్తున్నట్టు ఈ సందర్భంగా సెక్రటరీ అంకంరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండవ డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు పారుపల్లి దాసు, టీడీపీ నేత అంకంరెడ్డి యర్రాపాత్రుడు, మాజీ సర్పంచ్ శెట్టి శ్రీనువాసరావు, రైతులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులపై దాడుల నిరోధానికి చర్యలు చేపట్టాలి

చోడవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులపై దాడుల నిరోధానికి తగిన చర్యలు చేపట్టాలని బ్రాహ్మణ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లా మాజీ సమన్వయకర్త కొమ్మన మంచి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అర్చకులు, పురోహితులను గౌరవించడం సంప్రదాయమని, ఇటీవల కొంత మంది దౌర్జన్యకర శక్తులు బ్రాహ్మణులపై దాడులకు తెగబడడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు ఎంతమాత్రం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో బ్రాహ్మణులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా నిర్ణయాలు అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శ్రీరాంపట్నంలో క్రికెట్ టోర్నీ

చోడవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపట్నంలో సంక్రాంతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం జరిగాయి. సర్పంచ్ నక్కా రమణబాబు, జనసేన నాయకులు గనిరెడ్డి కల్యాణ గంగాధర్, ఉగ్గిన ప్రసాద్, కుంచా గంగాధరరావు ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహించారు. ఈ పోటీలకు అధిక సంఖ్యలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

గొంపలో పశువుల పాక దగ్ధం

రావికమతం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంప గ్రామంలో పల్లా శ్రీనుకు చెందిన ఒక పశువుల పాక దగ్ధమైంది. అయితే పశువులు బయట ఉండడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా. విషయం తెలుసుకున్న రావికమతం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

లక్ష్య సాధనకు కష్టించి పనిచేయాలి

కె.కోటపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు యువతకు కష్టించి పని చేయాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త జె.సూర్యనారాయణ కోరారు. కూండ్రపువానిపాలెం సత్యసాయి మందిరంలో సోమవారం జరిగిన యువ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సుగుణాలు కలిగిన వారు మంచి పౌరులుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థల ప్రతినిధి కె.అప్పలనాయుడు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలోని ఓ రిసార్ట్స్ పార్కులో భోగి మంట వెలిగిస్తున్న ఎంపీ సీఎం రమేశ్



మాడుగుల బస్టాండ్‌లో వేసిన భోగి మంట



రావికమతం: కవ్వగుంటలో గ్రామమంతా ఒకే చోట భోగి మంట కాసుకుంటున్న దృశ్యం

వాడవాడలా ఘనంగా భోగి పండగ

భోగి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లో పిల్లలు, పెద్దలు వేకువజామున లేచి స్నానాలు ఆచరించి భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులతో అందంగా అలంకరించారు. భోగి మంటలు కాచుకున్న అనంతరం దేవాలయాలకు వెళ్లి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

నర్సీపట్నం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం/రావికమతం/దేవరాపల్లి/మాడుగుల/మాడుగుల రూరల్/చీడికాడ/కె.కోటపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో భోగి పండగను నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొని భోగి మంటను వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం సంక్రాంతి పండగ వచ్చిందంటే గంగిరెద్దు, బుడబుక్కలు, హరిదాసు కనిపించేవారన్నారు. ఆ రోజులు గుర్తు చేసేలా అంతా కలిసి ఇటువంటి పండగలు చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే తెలుగు సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం



గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామంలో ముగ్గులు వేస్తున్న మహిళలు





నర్సీపట్నంలో భోగి మంట వేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ కుటుంబీకులు.. దేవరాపల్లి మండల కేంద్రంలో భోగి మంట

చేయడానికి అందరూ కృషి చేయాలని అన్నారు. వచ్చే ఉగాది పండగను రాష్ట్రంలో 14 వేల పంచాయతీలలో జరిపేలా జీవో ఇవ్వాలని చంద్రబాబును కోరినట్టు ఈ సందర్భంగా అయ్యన్న తెలిపారు. అనంతరం పిల్లలకు గాలిపటాలు పంపిణీ చేశారు. గచ్చపువీధి బృందం కోలాటం, హార్ట్‌ఫుల్ మెడిటేషన్ పిల్లలు డాన్సులు, బుడబుక్కలు, హరిదాసు, గంగిరెద్దు, కొయ్యదొర, సోదమ్మ ప్రదర్శనలు చిన్నారులను, పెద్దలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ట్రెజరర్ అల్లు అప్పారావు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బాబీ మాస్టారు, నాయకులు అప్పలనాయుడు, కుప్పిలి స్వామి, ఎంవీ రంగారావు పాల్గొన్నారు. అలాగే స్పీకర్ అయ్యన్నపాత్రుడు కటుంబ సభ్యులతో కలిసి భోగి పండగ జరుపుకున్నారు. అయ్యన్న భార్య పద్మావతి, కుమారులు, కోడళ్లు టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, డాక్టర్ సువర్ణ, రాజేశ్, దివ్యశ్రీ పాల్గొన్నారు. అలాఏ ఎంపీ సీఎం.రమేశ్ కుటుంబ సభ్యులతో కలిసి నర్సీపట్నంలో భోగి పండగ చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ కుటుంబీకులతో భోగి మంట వెలిగించారు.

గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట, పాకలపాడు, జోగంపేట, చీడిగుమ్మల, ఎర్రవరం, పాతమల్లంపేట, జోగంపేట, గొలుగొండ, సాలికమల్లవరం, పుత్తడిగైరంపేట గ్రామాల్లో భోగి పండగన ఘనంగా నిర్వహించారు. ఏటిగైరంపేట గ్రామంలో ముగ్గల పోటీలు నిర్వహించారు. అలాగే మాకవరపాలెం మండల కేంద్రంతో పాటు నారాయణరాజుపేట, కొత్తవీధిలో భోగి మంటలు వేసి చిన్నపిల్లకు భోగి పండ్లు వేశారు. అలాగే భజనలు, చిడతల నృత్యాలు ప్రదర్శించారు. నాతవరం మండలంలోని వివిధ గ్రామాల్లో భోగి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాతవరంలో రామాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. రావికమతం మండలంలో భోగి పండగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచే గ్రామాలు భోగి మంటలతో కళకళలాడాయి. సంప్రదాయబద్ధంగా దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఏ ఇంట ముందు చూసినా రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో కొత్తదనం కనిపించింది.

కె.కోటపాడు మండలంలో తెల్లవారుజామునే హిందువులంతా నిద్ర లేచి స్నానాలు చేసి పెద్ద పెద్ద భోగిమంటలు వేశారు. మేడిచర్ల గ్రామంలో భూగోదాదేవి సమేత కేశవస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. తెల్లవారుజామున పల్లకీ సేవలో భక్తిపాటలు పాడుతూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు వెంకటరమణమూర్తి శర్మ పూజలు చేశారు.

మాడుగుల మండలంలో భోగభాగ్యాల భోగి పండగ సోమవారం ఘనంగా జరిగింది. వేకువజామునే చిన్నారులతో సహా అందరూ మేల్కొని, నలుగు పెట్టించుకొని చన్నీటితో తలంటి స్నానాలు ఆచరించి భోగి మంటలు వేశారు. మండల మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల మంగ్గులు వేశారు. వస్త్ర దుకాణాలు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. దేవరాపల్లి మండలంలోని ప్రతీ గ్రామంలో భోగి మంటలు వేశారు. గిరిజన గ్రామాల్లో డప్పులు కొడుతూ అంతా ఒకేచోట చేరి మంటలు వేసుకున్నారు. చీడికాడ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు వేకువజామునే నిద్రలేచి భోగి స్నానాలు ఆచరించి భోగిమంటలు వేశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా భోగిమంటలు వేయడంతో గ్రామాలు భోగికాంతులతో కళకళలాడాయి.

పల్లెల్లో మౌలిక వసతులకు పెద్దపీట: ఎమ్మెల్యే



అన్నవరం వెంకయ్యగారిపేటలో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. సోమవారం పట్టణ శివారు అన్నవరం వెంకయ్యగారిపేటలో మూడు సీసీ రోడ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కావాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు, కాలువలు కూడా సంపూర్ణంగా పూర్తి చేసే బాధ్యత తనదేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, అన్నవరం టీడీపీ నాయకులు ఎర్రంశెట్టి చిన్న, స్థానిక టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల సంతకు సంక్రాంతి శోభ

» భారీగా తరలివచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజలు



కొనుగోలు దారులతో రద్దీగా ఉన్న వస్త్ర దుకాణాలు

మాడుగుల జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాడుగుల కేంద్రంలో సోమవారం వారపు సంత సంక్రాంతి శోభ సంతరించుకొంది. మంగళవారం సంక్రాంతి పండగను వైభవంగా నిర్వహించుకొనేందుకు వివిధ ప్రాంతాల ప్రజలు నూతన వస్త్రాలు, పలు సామగ్రి కొనుగోలు చేసేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో వారపు సంత కళకళలాడిపోంది. వస్త్ర, బంగారం, కిరాణా దుకాణాల వద్ద జనం బారులు తీరారు. అంతే కాకుండా మైదానం ప్రాంతాల నుంచి కూడా ప్రజలు తరలిరావడంతో మాడుగుల సంతకు కొత్త కళ వచ్చినట్టయింది.

బాల యేసు దేవాలయ మహోత్సవం



కొత్తకోట ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

రావికమతం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట బాల యేసు దేవాయ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ అజయ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, మాడుగుల, చోడవరం, పెద్ద బొడ్డేపల్లి, అనకాపల్లి తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు 30 మంది పాస్టర్లు, 500 మంది క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. మహోత్సవం ముగింపు సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాలయేసును గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రోడ్డుపై అడవి దున్నలు.. ఆందోళనలో గిరిజనులు



రహదారిపై ఉన్న అడవి దున్నలు

రావికమతం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో చీమలపాడు పంచాయతీ శివారు కల్యాణపులోవ జలాశయం ఆనుకోని ఉన్న సామాలమ్మ కొండ అటవీ ప్రాంతంలో నుంచి ఆదివారం రాత్రి అడవి దున్నలు రోడ్డుపై ప్రత్యక్షమయ్యాయి. జెడ్.జోగుంపేట గ్రామ గిరిజనులు ఆటోలో ఆదివారం సాయంత్రం కొత్తకోట వచ్చి పండగ బట్టలు, నిత్యావసర సరకులు కొనుగోలు చేసుకుని తిరిగి రాత్రి 8 గంటల సమయంలో స్వగ్రామానికి బయలు దేరి వెళ్తుండగా, జలాశయం దాటాక బంగారు బందల సమీపంలో రోడ్డుపై మూడు అడవి దున్నలు అడ్డంగా నిల్చొన్నాయి. ఆటో లైటింగ్‌కి చాలా సేపు అవి ఎటూ కదలకుండా రోడ్డుపైనే ఉండిపోవడంతో గిరిజనులు భయాందోళనకు గురయ్యారు. ఆటో డ్రైవర్ పాంగి నూకరాజు తన సెల్‌ఫోన్‌లో రోడ్డుపై ఉన్న అడవి దున్నలను ఫొటో తీశారు. చాలా సమయం వరకు కదలకపోవడంతో గిరిజనులు పెద్ద కేకలు, అరుపులు వేయడంతో అర కిలో మీటరు దూరం వెళ్లి అడవిలోకి జారుకున్నాయి. దీంతో గిరిజనులు ఊపిరి తీసుకున్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని వాపపక్షాల ఆందోళన



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేస్తున్న నాయకులు

చోడవరం/చీడికాడ/రోలుగుంట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, సీపీఐ, సీపీఎం నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. చోడవరంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల



చీడికాడ రహదారిపై సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

పేరుతో ప్రజలపై రూ.17 వేల కోట్ల భారం వేయడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌వీ.నాయుడు, రాము పాల్గొన్నారు. అలాగే సీపీఐ జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. ట్రూఅప్ చార్జీల భారం తగ్గించకపోతే దశల వారీ ఆందోళన చేపట్టనున్నామని రెడ్డిపల్లి హెచ్చరించారు. రోలుగుంటలో సీపీఎం నేత ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తే ఊరుకునేది లేదన్నారు. సర్దుబాటు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేత కె.గోవిందరావు పాల్గొన్నారు. అలాగే చీడికాడ మండలంలో పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు ఆధ్వర్యంలో ధర్నా, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు పేరుతో చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యుత్ వాడటానికి ప్రజలు భయపడుతున్నారన్నారు. ప్రజలపై భారం మోపే చార్జీలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో వైభవంగా అప్పికొండమ్మ తీర్థం

కృష్ణాదేవిపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో అప్పికొండమ్మ, కనకదుర్గ ఆలయాల వద్ద అమ్మవారి తీర్థాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. పరిసరాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం తదితర గ్రామాల నుంచి భక్తులు ఈ వేడుకకు భారీగా విచ్చేశారు. తీర్థం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఏఎల్‌పురంలో తీర్థంలో నృత్య ప్రదర్శన జరుగుతున్న దృశ్యం




పూలతో అలంకరించిన వరాహ నృసింహస్వామి అవతారం


భోగిమంట వెలిగించి సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుడుతున్న సింహాచల దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు

సింహగిరిపై అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

సింహగిరిపై సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. సోమవారం భోగి పండుగతో సంబరాలకు శ్రీకారం చుట్టారు. మాడవీధుల్లో డూడూబసవన్నలు, కొమ్మదాసరులు, జంగమదేవరలు సందడి చేశారు. పలువురు మహిళలు వేసిన రంగవల్లులు అలరించాయి. సంప్రదాయంలో భాగమైన బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచే ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు సకుటుంబ సమేతంగా సింహగిరికి వచ్చి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు సింహాద్రినాథుని దర్శించుకున్నారు.

- సింహాచలం/ఆంధ్రజ్యోతి

జోరుగా కోడి పందేలు

... 7వ పేజీ తరువాయి

ఎస్.రాయవరం శివారుల్లో కోడి పందేల శిబిరాలపై దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. నాలుగు కోడి పుంజులు, రూ.870 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి మండలం సుందరయ్యపేట శివారులో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని, రెండు కోడి పుంజులు, రూ.1,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కేజీహెచ్‌లో మరో రెండు డయాలసిస్ సెంటర్లు

... 7వ పేజీ తరువాయి

ప్రత్యేకంగా రోజుకు 30 మదికి డయాలసిస్ సేవలందిస్తున్నారు. నెఫ్రోప్లస్‌లో అందించే సేవలకు ఓపీ విధానంలో రోగులు డయాలసిస్ చేయించుకుని వెళ్తుంటారు. కాగా వార్డులో ఇన్‌పేషెంట్లు, ఇతర విభాగాల నుంచి వచ్చే వారికి సేవలందిస్తారు. ఇతర విభాగాల్లో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులను ఇక్కడకు తీసుకువచ్చి సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన అధికారులు ప్రత్యామ్నాయంగా ఈ రెండు వార్డుల్లో డయాలసిస్ సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

ఘనంగా సంక్రాంతి సంబరాలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంపీ సీఎం రమేశ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ముం దుగా సీఎం రమేశ్ దంపతులు స్టేడియంలో భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుట్టారు. హరిదాసులకు కానుకలను అందజేశారు. అనంతరం కళాకారుల చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎంపీ సీఎం రమేశ్ దంపతులు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ రాజు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, టీడీపీ నాయకులు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్య బాబు, మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, మాదంశెట్టి నీల బాబు, పీవీజీ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు ఆశీనులై సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. సంక్రాంతి సం బరాల్లో భాగంగా చిన్నారుల భరతనాట్యం, మణిపాల్‌కు చెందిన యువకుల విన్యాసాలు, గిరిజన కళాకారుల థింసా నృత్యం, పట్టణానికి చెందిన సాముగరిడి, తప్పెటగుళ్లు, పులివేషాలు, వివిధ జానపద నృత్యాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్టేడియం ఆవరణలో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.


హరిదాసుకు కానుకలు అందజేస్తున్న ఎంపీ సీఎం రమేశ్


భరతనాట్యం చేస్తున్న బాలికలు

సంప్రదాయాలను గుర్తు చేసేలా భోగి పండుగ


పిల్లలకు గాలి పటాలు పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నేటి తరానికి పాత సంప్రదాయాలను గుర్తు చేసేలా వాకర్స్ క్లబ్ సభ్యులు భోగి పండుగ నిర్వహించారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి పండుగను నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భోగి మంటను వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. వచ్చే ఉగాది పండుగను రాష్ట్రంలో 14 వేల పంచాయతీలలో జరిపేలా జీవో ఇవ్వాలని చంద్రబాబును కోరానని తెలిపారు. మంగళవారం నుంచి నిర్వహించే మకరజ్యోతి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. నర్సీపట్నంలో కంచి పీఠం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని, అవసరమైన స్థలం ఇస్తామని పీఠాధిపతికి తెలిపామని చెప్పారు.

అనంతరం పిల్లలకు గాలిపటాలు పంపిణీ చేశారు. గచ్చపువీధి బృందం కోలాటం, హార్ట్‌ఫుల్ మెడిటేషన్ పిల్లల డాన్సులు, బుడబుక్కలు, హరిదాసు, గంగిరెద్దు, కొయ్యదొర, సోదమ్మ ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. భోగి పండుగలో పాల్గొన్న వారి కోసం సంప్రదాయబద్ధంగా కట్టు పొంగలి, పచ్చిపులుసుతో పాటు అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, అప్పలనాయుడు, క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ట్రెజరర్ అల్లు అప్పారావు, ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ బాబీ, కుప్పిలి స్వామి, ఎంవీ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో వీఆర్ఎస్ ఉత్తర్వులు

- తక్షణమే యాజమాన్యం ఉపసంహరించుకోవాలని
- ఉక్కు పోరాట కమిటీ నాయకుల డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగమే వీఆర్ఎస్ ప్రకటన అని ఉక్కు పోరాట కమిటీ నాయకులు మండిపడ్డారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ముందు భోగి మంట వేసి అందులో వీఆర్ఎస్ ఉత్తర్వులను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యమే చేయడమే లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతుందని ధ్వజమెత్తారు. 130 శాతం ఉత్పత్తితో ముందున్న స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణపై పాలకులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఉక్కు యాజమాన్యం వీఆర్ఎస్ ఉత్తర్వులను ఉపసంహరిం చుకునేంత వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, పీవీ రమణమూర్తి, వరసాల శ్రీనివాసరావు, తౌడన్న, శ్రీనివాస్, యు.రామస్వామి, అప్పారావు, కారు రమణ, పల్లా పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.


వీఆర్ఎస్ ఉత్తర్వులను భోగి మంటల్లో వేస్తున్న నాయకులు

బౌద్ధుల ఆరామం బొజ్జన్నకొండ

... 7వ పేజీ తరువాయి

బౌద్ధక్షేత్ర అవశేషాలు బయటపడ్డాయి. ఇక్కడ లభించిన బంగారు నాణేల్లో కొన్ని సముద్రగుప్తుని హయాంలోని కాగా మరికొన్ని శాతవాహనుల కాలం నాటివని చరిత్రకారులు నిర్ధారించారు. కొండ మొదటి గుహ వద్ద బుద్ధునిఇ నిలువెత్తు స్థూపం ఉంది. బౌద్ధ భిక్షువులు నిత్యం ధ్యానం చేస్తూ బౌద్ధమతం గురించి ఈ ప్రాంతంలో ప్రచారం చేసేవారని చెబుతుంటారు. పక్కనే ఉన్న లింగాలకొండపై వందల సంఖ్యలో లింగాకార స్థూపాలు ఉన్నాయి.

పర్యాటకంగా గుర్తింపు

కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని బొజ్జన్నకొండను నిత్యం ఎంతో పర్యాటకులు సందర్శిస్తుంటారు. కొండపైన, గుహ లోపల శిల్ప సంపద, బుద్ధుని విగ్రహాలు, ధ్యాన మందిరాలు, బౌద్ధ భిక్షువులు ఆవాసం వుండడానికి పెద్ద పరిమాణంలోగల ఇటుకలతో నిర్మించిన ప్రదేశాలు ఆకట్టుకుంటాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.7.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. లేజర్ షో, సౌండ్ అండ్ లైటింగ్ షో, ధ్యాన మందిరం, ముఖద్వారం నిర్మించారు. దీంతో బొజ్జన్నకొండ మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రతి ఏటా కనుమ పండుగనాడు బౌద్ధమేళా నిర్వహిస్తుంటారు. బొజ్జన్నకొండకు వెళ్లాలంటే అనకాపల్లి పట్టణం నుంచి చోడవరం రోడ్డులో గల తుమ్మపాలకు చేరుకుని ఇక్కడి నుంచి తూర్పు దిశగా ప్రయాణించి బొజ్జన్నకొండకు చేరుకోవచ్చు. అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శంకరం గ్రామం నుంచి కూడా బొజ్జన్న కొండకు వెళ్లవచ్చు.


బొజ్జన్నకొండ వద్ద పచ్చిక మైదానం. గురువారం మేళా నిర్వహించే ప్రదేశం ఇదే

యువత సాయుధ దళాల్లో చేరాలి


మాట్లాడుతున్న తూర్పు నావికాదళం కమాండ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా


డెవిల్ రైడర్స్ విన్యాసాలు

- తూర్పు నావికాదళం కమాండ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా
- సాయుధ దళాల డేర్-2 అయోధ్య యాత్ర ప్రారంభం

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భారత నావికా దళం గురించి అవగాహన పెంపొందించడంతో పాటు యువతకు దేశ సేవ పట్ల ఆసక్తి కల్పించడానికి సాయుధ దళాల డేర్-2 అయోధ్య యాత్రను ప్రారంభించినట్టు తూర్పు నావికాదళం కమాండ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సెనా అన్నారు. బజాజ్ ఆటో సంస్థ, భారత సాయుధ దళాల భాగస్వామ్యంతో విశాఖ నుంచి అయోధ్య వరకు 13 రోజుల పాటు డేర్ -2 పేరుతో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీని సోమవారం ఆయన ఈఎన్‌సీలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బజాజ్ సంస్థకు చెందిన పల్సర్ ఎన్ఎస్ -400 జెడ్‌పై నావికా దళానికి చెందిన 15 మంది రైడర్లు అయోధ్య వరకు (1600 కిలోమీటర్లు) యాత్ర చేపడతారని తెలిపారు. విశాఖ నుంచి ఐఎన్ఎస్ చిల్కా, భువనేశ్వర్, జంషెడ్‌పూర్, రాంచీ, గయా, వారణాసి మీదుగా గణతంత్ర దినోత్సవం నాటికి అయోధ్యలోని డోగ్రా రెజిమెంట్‌కు చేరుతుందని వివరించారు. బజాజ్ ఆటో సంస్థ మార్కెటింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ మాట్లాడుతూ సాయుధ బలగాలు ధైర్యం ప్రదర్శించడంలో, సాహసాలు చేయడంలో ముందుంటాయని తెలిపారు. సాయుధ దళాలతో కలిసి దేశ సేవ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం డెవిల్ బైక్ రైడర్స్ చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నావికాదళం అధికారులు, బజాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం... crime news

కోడి పందేలు ఆడుతున్న ఐదుగురి అరెస్టు

కశింకోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం గ్రామ శివారున కోడి పందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. సోమవారం తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేయించామన్నారు. ఈ మేరకు వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ మనోజ్‌కుమార్, రైటర్ సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మాళ్లపాడులో ఇద్దరు..

రావికమతం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కోడి పందేలాడుతున్న ఇద్దరిని అరెస్టు చేశామని రావికమతం ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గుమ్మాళ్లపాడు గ్రామ శివారులో కోడి పందేలాడుతున్నారని స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో సోమవారం మధ్యాహ్నం దాడి చేసి కోడి పందేలాడుతున్న ఇద్దరిని అరెస్టు చేశామని చెప్పారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.850 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే డోలవానిపాలెంలో 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్ఐ తెలిపారు.


కోడి పందేలరాయుళ్లను పట్టుకున్న పోలీసులు

కోడి పందేలు, పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

- ఎనిమిది మంది అరెస్టు

ఎస్.రాయవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన కోడి పందేలు, పేకాట శిబిరాలపై సోమవారం దాడులు నిర్వహించి, ఎనిమిది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. నాలుగు పందెం కోళ్లతో పాటు రూ 4,050 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. తిమ్మాపురం గ్రామ శివారు, అలాగే ఎస్.రాయవరం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నట్టు అందిన సమాచారంతో సిబ్బందితో ఆయా ప్రదేశాలకు వెళ్లి కోడి పందేల శిబిరాలపై దాడులు నిర్వహించి ఒకచోట ఇద్దరి వ్యక్తులను పట్టుకొని, రెండు పందెం కోళ్లతో పాటు రూ 320 నగదు స్వాధీనం చేసుకోగా, మరొకచోట కూడా ఇద్దరి వ్యక్తులను పట్టుకొని, రెండు కోళ్లతో పాటు రూ 550 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఎస్.రాయవరం గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురి పేకాటరాయుళ్లతో పాటు రూ.3,180 నగదును స్వాధీనం చేసుకొని, పట్టుబడ్డ ఎనిమిది మంది వ్యక్తులపై కేసులు నమోదుచేసి, కోళ్లను, నగదును సీజ్ చేసినట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు.

16 మందిపై కేసు నమోదు

రాంబిల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడివాడ, వెల్చూరు, దిమిలి గ్రామాల్లో సోమవారం పేకాట శిబిరాలపై దాడి చేసి 16 మందిపై కేసు నమోదు చేసినట్టు రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆ మూడు గ్రామాల్లో పేకాట శిబిరాలపై దాడి చేశామన్నారు. వారి నుంచి రూ.10,160లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పెదరెల్లివీధి శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పెదరెల్లివీధి శివారు ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక దాడి చేయగా ఐదుగురు పేకాట ఆడుతున్నారన్నారు. వీరిని అరెస్టు చేసి రూ.8,920 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.